సాక్షి ఖమ్మం

గురువారం । 3 । జూలై । 2025



మామిడి.. రైతుల్లో అలజడి

మామిడి తోటలకు చీడపీడలు ఆశించి నష్టాలు వస్తుండడంతో పలువురు తోటలను తొలగించి ఆయిల్‌పామ్ సాగుకు మళ్లుతున్నారు. 8లో



రైతు భరోసా జిమ్మిక్కే..

స్థానిక సంస్థల్లో ఎన్నికల్లో లాభం కోసమే రాష్ట్రప్రభుత్వం రైతుభరోసా నిధులు విడుదల చేసిందని ఎమ్మెల్సీ కవిత ఆరోపించారు. 8లో

వాతావరణం

గరిష్టం / కనిష్టం
31° / 24°

జిల్లాలో గురువారం మధ్యాహ్నం ఉష్ణోగ్రత పెరిగే అవకాశముంది. సాయంత్రం తర్వాత వర్షం కురిసే సూచనలు ఉన్నాయి.

న్యూస్‌రీల్

మహిళల ఫిర్యాదులపై తక్షణ స్పందన

- పోలీసు కమిషనర్ సునీల్‌దత్



ఉద్యోగులకు సూచనలు చేస్తున్న సీపీ

ఖమ్మంక్రైం: వివిధ సమస్యలపై పోలీస్‌స్టేషన్‌ను ఆశ్రయించే మహిళల విషయంలో తక్షణమే స్పందించాలని పోలీసు కమిషనర్ సునీల్‌దత్ ఆదేశించారు. ఖమ్మంలోని మహిళా పోలీస్ స్టేషన్‌ను బుధవారం తనిఖీ చేసిన ఆయన పెండింగ్ కేసులు, దర్యాప్తు, చార్జిషీట్ల దాఖలు తదితర అంశాలపై ఆరా తీశాక మాట్లాడారు. మహిళల భద్రతను ప్రథమ ప్రాధాన్యతగా తీసకుని వారు ఇచ్చే ఫిర్యాదుల పరిష్కారానికి కృషి చేయాలని సూచించారు. అలాగే, మహిళలతో మర్యాదగా వ్యవహరించడమే కాక కళాశాలలు, పాఠశాలలు, మహిళలు ఎక్కువగా ఉండే ప్రాంతాలను పోలీసు సిబ్బంది గస్తీ కాయాలని చెప్పారు. సీఐలు శ్రీహరి, కరుణాకర్ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనుల్లో వేగం పెంచాలి



విద్యార్థినులతో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్

కారేపల్లి: అభివృద్ధి పనులను త్వరగా పూర్తిచేయడం ద్వారా విద్యార్థులకు మెరుగైన వసతులు కల్పించాలని అదనపు కలెక్టర్ డాక్టర్ పి.శ్రీజ సూచించారు. కారేపల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సింగరేణి కేటాయించిన రూ.30 లక్షల నిధులతో చేపడుతున్న పనులను బుధవారం పరిశీలించిన ఆమె నాణ్యతపై దృష్టి సారించాలని పంచాయతీరాజ్ శాఖ అధికారులను ఆదేశించారు. అలాగే, బోర్డ్ మంజూరు చేసిన రూ.20.50 లక్షలతో చేపట్టాల్సిన పనులపై ప్రతిపాదనలు సమర్పించాలని తెలిపారు. కాగా, కళాశాలలో 200మంది విద్యార్థులు చేరడంపై ప్రిన్సిపాల్ విజయకుమారి, అధ్యాపకులను ఆమె అభినందించారు. అనంతరం కారేపల్లిలోని పోస్ట్‌మెట్రిక్ బాలికల హాస్టల్‌ను సందర్శించి విద్యార్థినులతో మాట్లాడి వసతులు, మెనూపై ఆరా తీశారు. డీఐఈఓ రవిబాబు, స్పెషల్ ఆఫీసర్ నవీన్‌బాబు, ఎంపీడీఓ సురేందర్, ప్రిన్సిపాల్ విజయకుమారి, ఎంపీఓ రవీంద్రప్రసాద్, గ్రామకార్యదర్శి నెహ్రూ ఉన్నారు.

పెరుగుతున్న రిజర్వాయర్ నీటిమట్టం

వైరా: మూడు నాలుగు రోజులుగా కురుస్తున్న వర్షాలతో ఎగువ ప్రాంతం నుంచి వస్తున్న వరద కారణంగా వైరా రిజర్వాయర్ నీటిమట్టం క్రమంగా పెరుగుతోంది. రిజర్వాయర్ పూర్తి స్థాయి నీటి మట్టం 18.4 అడుగులు కాగా, ప్రస్తుతం చేరుతున్న వరతో బుధవారం 16.3 అడుగులకు చేరుకుంది. దీంతో రిజర్వాయర్ ఆయకట్టు కింద రైతులు వరినాట్లు వేయడానికి సిద్ధమవుతున్నారు.

చేపల వేట నిషేధం


వైరా రిజర్వాయర్‌లో రెండు నెలల పాటు చేపల వేట నిషేధిస్తున్నట్లు మత్స్య అభివృద్ధి అధికారి తెలిపారు. చేపల పునరుత్పత్తి కాలమైనందున ఆగస్టు 31వరకు చేపల వేటపై నిషేధం ఉంటుందని పేర్కొన్నారు. ఈమేరకు వలలు, బుట్టలు తొలగించి.. మత్స్యకారులు వేటకు వెళ్లకుండా మత్స్య సహకార సంఘం బాధ్యులు పర్యవేక్షించాలని సూచించారు.

ఎరువు కృత్రిమ కొరత సృష్టిస్తే చర్యలు



రికార్డులు తనిఖీ చేస్తున్న డీఏఓ

మధిర: జిల్లాలో రైతులకు సరిపడా ఎరువులు ఉన్నందున, ఎక్కడైనా డీలర్లు కృత్రిమ కొరత సృష్టించాలని చూస్తే చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని జిల్లా వ్యవసాయాధికారి ధనసరి పుల్లయ్య హెచ్చరించారు. మధిరలో బుధవారం నిర్వహించిన విత్తన, ఎరువుల దుకాణాల డీలర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. రైతులకు నాణ్యమైన విత్తనాలు, ఎరువులను విక్రయించడమే కాక అన్ని వివరాలతో రికార్డులు నిర్వహించాలని సూచించారు. అలాగే, యూరియా వాడకాన్ని తగ్గించి నానో యూరియా వాడేలా అవగాహన కల్పించాలని తెలిపారు. ఆతర్వాత మండలంలోని పలు ఎరువుల షాపుల్లో తనిఖీ చేసిన డీఏఓ, రాయపట్నంలో పచ్చిరొట్ట వేసిన పొలాన్ని పరిశీలించారు. మధిర ఏడీఏ విజయ్‌చంద్ర, ఏఓ సాయిదీక్షిత్, ఏఈఓలు జిష్ణు, గురుమూర్తి, ఆత్మ కమిటీ సభ్యులు గోపాలరావు తదితరులు పాల్గొన్నారు.



చేరికలు ఇలా...

కాలేజీ	మొత్తం సీట్లు	ప్రవేశాలు
ఎస్‌ఆర్ అండ్ బీజీఎన్‌ఆర్	1,560	921
మహిళా కాలేజీ	600	215
మధిర	300	110
సత్తుపల్లి	480	213
నేలకొండపల్లి	300	106

డిగ్రీ మాకొద్దు...

ప్రవేశాలకు విద్యార్థుల అనాసక్తి

- ప్రభుత్వ కాలేజీల్లో ఇప్పటివరకు నామమాత్రంగానే సీట్ల భర్తీ
- నాలుగు కాలేజీల్లో సగానికి పైగా ఖాళీలే

దోస్త్(డిగ్రీ ఆన్‌లైన్ సర్వీసెస్, తెలంగాణ) ద్వారా డిగ్రీ కాలేజీల్లో ప్రవేశాల ప్రక్రియ కొనసాగుతోంది. జిల్లాలో ఐదు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలు ఉండగా.. ఇప్పటికే మూడు విడతల కౌన్సెలింగ్ పూర్తయింది. ఇందులో 1, 2వ విడత సీట్లు కేటాయింపు పూర్తికాగా, సెల్ఫ్ రిపోర్టింగ్ చేసిన విద్యార్థులు తక్కువగా ఉండడం గమనార్హం. దీంతో కాలేజీల్లో భారీగా సీట్లు మిగిలిపోయే అవకాశముందని భావిస్తున్నారు.

– ఖమ్మం సహకారనగర్

నాలుగింట అంతంతే...

జిల్లా కేంద్రంలోని ఎస్‌ఆర్ అండ్ బీజీఎన్‌ఆర్ డిగ్రీ కళాశాలలో చేరేందుకు విద్యార్థులు ఆసక్తి కనబరిచారు. జిల్లా కేంద్రంలో ఉండడం, హాస్టళ్ల సమీపాన ఉండడమే కాక రవాణాకు అనువైన పరిస్థితులతో ఎక్కువ మంది ఈ కళాశాలపై మొగ్గు చూపినట్లు తెలుస్తోంది. ఐదు కాలేజీల్లో 3,240 సీట్లు ఉండగా, 1,565 మంది విద్యార్థులు సెల్ఫ్ రిపోర్టింగ్ చేశారు. ఇందులో ఎక్కువ మంది ఎస్‌ఆర్‌బీజీఎన్‌ఆర్ వైపే మొగ్గు చూపారు. మిగతా కాలేజీల్లో నామమాత్రంగా ప్రవేశాలు నమోదు కాగా, ఇంకొందరికి సీట్లు అలాట్ అయినా.. రిపోర్ట్ చేస్తారా, లేదా అన్నది తేలాల్సి ఉంది. పలువురు విద్యార్థులు సర్టిఫికెట్ల పరిశీలనకు హాజరై సీట్లు దక్కినా రిపోర్టింగ్ చేయడం లేదు. అలాగే, కళాశాలల్లో చేరిన విద్యార్థుల్లో ఎక్కువ మంది బీకాం, బీఎస్సీ కోర్సులపై ఆసక్తి చూపినట్లు గణాంకాలు చెబుతున్నాయి.

నేటితో రిపోర్టింగ్‌కు ఆఖరు

డిగ్రీ కాలేజీల్లో ప్రవేశాలకు గాను మూడో విడత సెల్ఫ్ రిపోర్టింగ్ గడువు గురువారంతో ముగియనుంది. మూడు విడతల్లో సెల్ఫ్ రిపోర్టింగ్ చేసిన విద్యార్థులు ఈనెల 5వ తేదీవరకు కళాశాలలో సీటు ఖరారు చేసుకోవాల్సి ఉంటుందని ఎస్‌ఆర్ అండ్ బీజీఎన్‌ఆర్ కళాశాల ప్రిన్సిపాల్ మహ్మద్ జకీరుల్లా, దోస్త్ కోఆర్డినేటర్ ఎం.డీ.సలీం పాషా తెలిపారు. సకాలంలో సర్టిఫికెట్లు సమర్పించి సీట్లు ఖరారు చేసుకోకపోతే రద్దవుతుందని వెల్లడించారు.

మరో దఫా అవకాశం ఇస్తారా?

జిల్లాలోని ఐదు ప్రభుత్వ డిగ్రీ కాలేజీల్లో ఎక్కువ సీట్లు మిగిలిపోతుండగా, రాష్ట్రంలోని పలుప్రాంతాల్లో ఇదే పరిస్థితి నెలకొన్నట్లు సమాచారం. ప్రస్తుతం ఇంజనీరింగ్ కాలేజీల్లో ప్రవేశాలకు ఎప్‌సెట్ కౌన్సెలింగ్ కొనసాగుతోంది. ఇంటర్ పూర్తిచేసిన చాలా మంది విద్యార్థులు అటే మొగ్గు చూపుతుండడంతో డిగ్రీ కాలేజీలకు ఆదరణ తగ్గుతోందని భావిస్తున్నారు. అయితే, ఎప్‌సెట్ కౌన్సెలింగ్ ముగిశాక డిగ్రీ కాలేజీల్లో ప్రవేశాలకు మరో దఫా కౌన్సెలింగ్ నిర్వహిస్తేనే ఫలితం ఉంటుందని పలువురు భావిస్తున్నారు. ఈ దిశగా ప్రభుత్వం, ఉన్నతాధికారులు దృష్టి సారిస్తే ప్రభుత్వ కాలేజీలు కళకళలాడనున్నాయి.

నాయకులకు క్రమశిక్షణే ముఖ్యం

- ఖర్గే పర్యటన విజయవంతానికి పాటుపడాలి
- రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు



కాంగ్రెస్ కార్యాలయంలో మాట్లాడుతున్న మంత్రి తుమ్మల, పక్కన ఎంపీ రఘురాంరెడ్డి, నాయకులు

ఖమ్మంమయూరిసెంటర్: రాజకీయాల్లో కొనసాగాలనుకునే నాయకులు, కార్యకర్తలు క్రమశిక్షణ పాటించాలని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సూచించారు. ఖమ్మంలోని కాంగ్రెస్ కార్యాలయంలో బుధవారం జిల్లా అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్ అధ్యక్షతన జరిగిన పట్టణ, మండల, గ్రామ బూత్ స్థాయి అధ్యక్షుల సమావేశంలో మంత్రి మాట్లాడారు. ఏ స్థాయి నాయకుడైనా ప్రజాభిమానం పొందాలంటే క్రమశిక్షణ తప్పనిసరని చెప్పారు. జై భీం, జై బాపు, జై సంవిధాన్ కార్యక్రమంలో భాగంగా ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున్‌ఖర్గే ఈనెల 4న హైదరాబాద్ వస్తున్నందున జిల్లా నుంచి భారీగా శ్రేణులను తరలించేలా కృషి చేయాలని సూచించారు. కాగా, రాష్ట్రంలో బీఆర్‌ఎస్ తన మనుగడను కాపాడుకునేందుకు కాంగ్రెస్‌పై తప్పుడు ఆరోపణలు చేస్తున్న విషయాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లాలని తెలిపారు. పోలవరం, బనకచర్ల ప్రాజెక్టులపై బీఆర్‌ఎస్ చేసే ఆరోపణల్లో ఎలాంటి వాస్తవం లేదని చెప్పారు. ఈసమావేశంలో ఎంపీ రామసహాయం రఘురాంరెడ్డి, నాయకులు శ్రావణ్‌కుమార్‌రెడ్డి, చక్కిలం రాజేశ్వర్‌రావు, రవీందర్ మాట్లాడగా రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావుతో పాటు మహ్మద్ జావేద్, బాలసాని లక్ష్మీనారాయణ, నాగండ్ల దీపక్‌చౌదరి, తుంబూరు దయాకర్‌రెడ్డి, బాలగంగాధర్ తిలక్, కొత్త సీతారాములు, దొబ్బల సౌజన్య, మొక్కా శేఖర్‌గౌడ్, బొడ్డు బొందయ్య తదితరులు పాల్గొన్నారు.

నిరుపేదలందరికీ ఇళ్లు

రఘునాథపాలెం: దశల వారీగా నిరుపేదలందరికీ ఇందిరమ్మ ఇళ్లు మంజూరవుతాయని రాష్ట్ర మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. రఘునాథపాలెం మండలంలోని పలు గ్రామాల్లో బుధవారం సీసీ, బీటీ రోడ్లు, డ్రెయినేజీల నిర్మాణానికి మంత్రి శంకుస్థాపన చేసి మాట్లాడారు. గుడిసెల్లో ఉంటున్న వారికి తొలివిడత ఇళ్లు మంజూరు చేయాలని అధికారులను ఆదేశించినట్లు తెలిపారు. రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, ఖమ్మం మార్కెట్ చైర్మన్ యరగర్ల హన్మంతరావు, జెడ్పీ సీఈఓ దీక్షారైనా, ఆర్డీఓ నరసింహారావు, జిల్లా వ్యవసాయ అధికారి పుల్లయ్య, పీఆర్ ఎస్‌ఈ వెంకట్‌రెడ్డి, ఆర్‌అండ్‌బీ ఈఈ పవార్, తహసీల్దార్ శ్వేత, ఎంపీడీఓ అశోక్‌కుమార్‌తో పాటు దిరిశాల వెంకటేశ్వర్లు, మానుకొండ రాధాకిషోర్, సాధు రమేష్‌రెడ్డి, వాంకుడోత్ దీపక్, జానబోయిన పాపయ్య, వెంకటరెడ్డి, కరుణాకర్‌రెడ్డి, సుధాకర్ పాల్గొన్నారు.

అన్నివర్గాల సంక్షేమమే లక్ష్యం

- మరింతగా ఏదులాపురం మున్సిపాలిటీ అభివృద్ధి
- రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి



ఏసీపీ కార్యాలయాన్ని ప్రారంభించిన మంత్రి పొంగులేటి, పక్కన ఎంపీ రఘురాంరెడ్డి, సీపీ సునీల్‌దత్ తదితరులు

ఖమ్మంరూరల్: ఏడాదిన్నర కాలంలో తమ ప్రభుత్వం అనేక అభివృద్ధి, సంక్షేమ పథకాలను అమలు చేయగా.. అన్నివర్గాల సంక్షేమానికి మరింత పాటుపడతామని రాష్ట్ర రెవెన్యూ, గృహనిర్మాణ, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. ఖమ్మం రూరల్ మండలం పొన్నెకల్‌తో పాటు ఏదులాపురం మున్సిపాలిటీ పరిధిలో వివిధ పనులకు మంత్రి బుధవారం శంకుస్థాపన చేశారు. అలాగే, ఎంపీడీఓ కార్యాలయంలో మున్నేరు కేబుల్‌బ్రిడ్జి నిర్వాసితులకు ఇళ్ల పట్టాలను పంపిణీ చేశాక ఆయన మాట్లాడారు. పేదలకు ఇందిరమ్మ ఇళ్లు, రైతు భరోసా, సన్నధాన్యానికి బోనస్ చెల్లించిన ఘనత తమదేనని తెలిపారు. అర్హులైన ప్రతీఒక్కరికి ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తామని, ఈ విషయంలో ఎవరూ అధైర్య పడొద్దని మంత్రి సూచించారు. కాగా, కొత్తగా ఏర్పాటైన ఏదులాపురం మున్సిపాలిటీని మరింత అభివృద్ధి చేసి ఆదర్శంగా నిలుపుతామని మంత్రి వెల్లడించారు. ఎంపీ రామసహాయం రఘురాంరెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వం అన్ని వర్గాల ప్రజలకు సమన్యాయం చేసేలా పథకాలను అమలు చేస్తోందని తెలిపారు.

ఏసీపీ కార్యాలయం ప్రారంభం

ఖమ్మం రూరల్ ఏసీపీ నూతన కార్యాలయంతో పాటు ఆధునీకీకరించిన రూరల్ పోలీస్‌స్టేషన్ భవనాన్ని ఎంపీ రామసహాయం రఘురాంరెడ్డి, సీపీ సునీల్‌దత్‌తో కలిసి మంత్రి పొంగులేటి ప్రారంభించారు. బాధితులు నిర్భయంగా స్టేషన్‌కు వచ్చి సమస్యలు చెప్పుకునేలా వాతావరణం కల్పించాలని అధికారులకు సూచించారు. ఈకార్యక్రమాల్లో రాష్ట్ర గిడ్డంగుల కార్పొరేషన్ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, ఆర్డీఓ నర్సింహారావు, ఏదులాపురం మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసరెడ్డి, తహసీల్దార్ పి.రాంప్రసాద్, అడిషనల్ డీసీపీ ప్రసాదరావు, ఏసీపీలు తిరుపతిరెడ్డి, రమణమూర్తి పాల్గొన్నారు.

నేడు కూసుమంచిలో పర్యటన

ఖమ్మంమయూరిసెంటర్: రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి గురువారం జిల్లాలో పర్యటించనున్నారు. కూసుమంచి మండలం ధర్మతండా, కొక్యాతండా, లోక్యాతండా, గన్యాతండాతో పాటు కూసుమంచిలో రోడ్డు నిర్మాణ పనులు, ఇతర అభివృద్ధి పనులకు మంత్రి శంకుస్థాపన చేస్తారు.

మైనార్టీ పాఠశాలల ఆర్‌సీఓగా అరుణకుమారి



అరుణకుమారి

కొణిజర్ల: ఉమ్మడి జిల్లాలోని తెలంగాణ మైనార్టీ బాలుర, బాలికల గురుకుల పాఠశాలల ప్రాంతీయ సమన్వయకర్త (ఆర్‌సీఓ)గా ఎం.జే.అరుణకుమారి నియమితులయ్యారు. ఆమె ప్రస్తుతం కొణిజర్ల మండలం అమ్మపాలెం మైనార్టీ బాలుర గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్‌గా విధులు నిర్వర్తిస్తుండగా, ఆర్‌సీఓగా పూర్తి అదనపు బాధ్యతలు అప్పగించారు. ఈ సందర్భంగా అరుణకుమారి మాట్లాడుతూ ఉమ్మడి జిల్లాలోని మైనార్టీ గురుకుల పాఠశాలలు, కళాశాలల విద్యార్థులకు నాణ్యమైన విద్య అందేలా పర్యవేక్షిస్తానని తెలిపారు.

పలువురు సీఐల బదిలీ

ఖమ్మంక్రైం: జిల్లాలోని వివిధ స్టేషన్లలో విధులు నిర్వర్తిస్తున్న సీఐలను బదిలీ చేస్తూ ఐజీ చంద్రశేఖర్‌రెడ్డి బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. మహిళా పోలీస్ స్టేషన్ సీఐ తుమ్మలపల్లి శ్రీహరిని సత్తుపల్లికి బదిలీ చేయగా, అక్కడి సీఐ టి.కిరణ్‌ను ఐజీ కార్యాలయానికి అటాచ్ చేశారు. అలాగే, వెయిటింగ్‌లో ఉన్న నల్లమోతు చిట్టిబాబును మహిళా పోలీస్ స్టేషన్‌కు, తాండూరు సీఐ కన్నం కుమారస్వామిని మధిరకు బదిలీ చేయగా.. అక్కడ పనిచేస్తున్న దొంగరి మధును ఐజీ కార్యాలయానికి అటాచ్ చేస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి.

మెరుగుపడవు.. నడక సాగదు



శ్రీనివాసనగర్‌లోని సత్యసాయి నగర్ రోడ్డు నంబర్-5లో ఇలా..

పురపాలికల శివార్లలో ప్రజల ఇక్కట్లు

- రహదారులు సరిగ్గా లేక వర్షం వస్తే సమస్య తీవ్రం
- మంచిగా ఉన్నచోట తవ్వకాలతో గుంతలు

సాక్షి ఫోకస్

కార్పొరేషన్లు, మున్సిపాలిటీల ఏర్పాటు సమయాన శివారు గ్రామాలను విలీనం చేయడం పరిపాటి. తద్వారా ఇంటి పన్నులు పెరగడంతో పాటు ప్రజలపై ఇతర భారం పడుతున్నా సౌకర్యాల కల్పనలో మాత్రం పాలకులు, అధికారులు నిర్లక్ష్యంగానే వ్యవహరిస్తున్నారు. ఇతర సౌకర్యాలు, వసతుల మాటేమో కానీ కనీసం అంతర్గత రహదారులు నిర్మించకపోవడంతో చిన్నపాటి వర్షం వస్తే చాలు బురదమయమై అడుగు తీసి అడుగు వేసే పరిస్థితి ఉండడం లేదు. ఖమ్మం కార్పొరేషన్, మున్సిపాలిటీల్లో బుధవారం 'సాక్షి' పరిశీలించగా పలు సమస్యలు వెలుగు చూశాయి.

అభివృద్ధికి దూరంగానే...

ఖమ్మంమయూరిసెంటర్: ఖమ్మం కార్పొరేషన్ పరిధి ప్రధాన ప్రాంతాల్లో రోడ్లను ఆధునీకీకరించినా విలీన, శివారు ప్రాంతాల్లో ఆ పరిస్థితి లేక ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. విలీన పంచాయతీలు ఖమ్మంలో విలీనమై దశాబ్దకాలం దాటినా ఇంకా సరైన రోడ్లు, డ్రెయినేజీలు లేకపోవడం గమనార్హం. వర్షాకాలంలో మట్టి రోడ్లు బురదమయమై రోడ్డుపై నడిచే పరిస్థితి ఉండడం లేదు. కార్పొరేషన్ పరిధిలో బీటీ రోడ్లు 11.39 కి.మీ., సీసీ రోడ్లు 172.32 కి.మీ. ఉండగా.. మట్టి రోడ్లు 23.46 కి.మీ., మెటల్ రోడ్లు 27.20 కిలోమీటర్ల మేర ఉన్నట్లు అధికారిక రికార్డులు చెబుతున్నాయి.

చినుకుపడితే చిత్తడే..

ఖమ్మంలో నివసించేందుకు వస్తున్న జనాభా పెరుగుతుండడంతో నివాసాలు, కాలనీలోనూ పెరుగుతున్నాయి. గత నాలుగేళ్లలో శివారు, విలీన పంచాయతీల్లో గృహాల సంఖ్య రెట్టింపయింది. కానీ ఆయా కాలనీలకు రోడ్ల సౌకర్యం కల్పించకపోవడంతో మట్టి రోడ్లతో జనం అవస్థ పడుతున్నారు. దీనికి తోడు మిషన్ భగీరథ, యూజీడీ పైపులైన్ల పేరుతో నగరంలోని పలు ప్రాంతాల్లో రోడ్లను ధ్వంసం చేశారు. పైపులైన్లు వేశాక సక్రమంగా పూడ్చకపోవడంతో వాహనదారులు ఇబ్బంది పడుతున్నారు. గత ఏడాది మున్నేటి వరద ముంచెత్తిన కాలనీల్లో ధ్వంసమైన రోడ్లను చాలాచోట్ల ఇప్పటికీ మరమ్మతు చేయకపోవడం అదే పరిస్థితి నెలకొంది.

చినుకు పడితే బురదమయమే

వైరా: గత ముప్పై ఏళ్ల క్రితం వైరా మేజర్ గ్రామపంచాయతీగా ఉన్నప్పుడు వేసిన ఈ రోడ్డు వైరా మున్సిపాలిటీ ఏర్పడి ఏడేళ్లు గడచినా అభివృద్ధికి నోచుకోవడం లేదు. మున్సిపాలిటీ పరిధిలో పాత కూరగాయల మార్కెట్ నుంచి వాసవీ కళ్యాణ మండపం వరకు ఉన్న ప్రధాన రహదారి గుంతలమయమైంది. మొత్తం మున్సిపాలిటీలో అత్యంత దారుణంగా ఉన్న రోడ్డు ఇదేనని చెప్పాలి. వాసవీ కళ్యాణమండపం రోడ్డు నుంచి ఎస్సీ బాలుర వసతిగృహానికి వెళ్లే ప్రధాన రహదారి లోతట్టు ప్రాంతం కావడంతో వర్షం కురిసినప్పుడల్లా కొంత చొప్పున గతంలో వేసిన బీటీ కొట్టుకుపోయింది. రెండేళ్ల క్రితం కురిసిన భారీ వర్షాలకు రహదారి మొత్తం కొట్టుకోపోగా నిర్మాణానికి నిధులు మంజూరవుతాయని చెబుతున్నా ఆచరణ రూపం దాల్చడం లేదు. బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో మంజూరైన రూ.20 కోట్ల నిధులతో మున్సిపాలిటీ పరిధిలో సుమారు 51 కి.మీ. మేర సీసీ రోడ్ల నిర్మాణం చేపట్టినా ఈ రహదారికి మాత్రం మోక్షం లభించలేదు.



వాసవీ కల్యాణ మండపం సమీపాన ప్రధాన రహదారి

నడవాలంటే ఇబ్బంది..



ఆర్టీసీ బస్టాండ్ నుండి పాత కూరగాయల మార్కెట్ రోడ్డులో నడవాలంటేనే ఇబ్బందిగా ఉంటుంది. అంతా గతుకులమయమై సమీపంలోని ఇళ్లలో వాడిన మురుగునీరు కూడా రోడ్డుపైకే వస్తోంది. వర్షాకాలంలోనైతే సమస్య మరింత తీవ్రంగా ఉంటుంది.

– శ్రీదేవి, 12వ వార్డు

నడవాలంటే నాట్యమే...

మధిర: మధిర మున్సిపాలిటీ పరిధిలో ఉన్న రోడ్లపై నడుస్తుంటే నాట్యాన్ని తలపిస్తుంది. మున్సిపాలిటీ పరిధిలో 127 కి.మీ. రోడ్లు ఉండగా.. అందులో 35 కి.మీ.మేర మట్టి రోడ్డే ఉంటుంది. అలాగే, పలుచోట్ల సీసీ రోడ్లను పగలగొట్టి మిషన్ భగీరథ పైప్‌లైన్లు వేశారు. ఆతర్వాత మరమ్మతు చేసినా ఫలితం కానరావడం లేదు. ఇక ఇప్పుడు మధిరలో అండర్ గ్రౌండ్ డ్రెయినేజీ పనులు చేపడుతుండడంతో అన్నిచోట్ల రోడ్లను తవ్వుతున్నారు. టీచర్స్ కాలనీ, ఎంప్లాయిస్ కాలనీ, బంజారాకాలనీ తదితర ప్రాంతాల్లో నల్లరేగడి మట్టి కావడంతో చిన్నపాటి వర్షానికే రోడ్లు బురదమయమవుతున్నాయి. గుంతల్లో నీరు నిలిచి ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందో తెలియక ద్విచక్ర వాహనదారులు, పాదచారులు ఆందోళన చెందుతున్నారు.



బురదమయంగా టీచర్స్ కాలనీలోని రోడ్డు

బాగున్న రోడ్ల ధ్వంసం



అడపా సత్యనారాయణ వీధిలో తవ్వి వదిలేసిన సీసీ రోడ్డు

సత్తుపల్లి: సత్తుపల్లి మున్సిపాలిటీ పరిధిలో ప్రధాన వీధుల్లో సీసీ, బీటీ రోడ్లు వేశారు. అయితే, టీచర్స్ కాలనీలో పరిశీలించగా కొత్తగా ఏర్పడిన కాలనీల వద్ద సీసీ రోడ్లు లేక చిన్నపాటి వర్షానికే మట్టిరోడ్లు బురదమయ్యాయి. మున్సిపాలిటీ పరిధిలో 75 కి.మీ. మేర సీసీ రోడ్లు ఉండగా, ఇంకో ఐదు కి.మీ.పై గా నిర్మించాలి. దీనికి తోడు అవసరమైన చోట డ్రెయినేజీల నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేశారు. ప్రధానంగా రాజీవ్‌కాలనీలో అంతర్గత రహదారులు, డ్రెయినేజీల నిర్మాణంపై దృష్టి సారించారు. ఇకపోతే మిషన్ భగీరథ పేరుతో బాగున్న సీసీ రోడ్లను ఇష్టారీతిన తవ్వి వదిలేయడంతో చాలా చోట్ల స్థానికులు ఇబ్బంది పడుతున్నారు.

ఆరు నెలలైంది..



మా అడపా సత్యనారాయణ వీధిలో ఆరు నెలల క్రితం మిషన్ భగీరథ పైపులైన్ కోసం సీసీ రోడ్డును తవ్వారు. ఆపై మరమ్మతు చేయకపోవడంతో ఇంట్లో నుంచి వాహనాలను బయటకు తీసేందుకు ఇబ్బంది పడుతున్నాం. అలాగే, డ్రెయినేజీల్లో మురుగు సాగక దుర్వాసన వస్తోంది.

– చందు, అడపాసత్యనారాయణ వీధి, సత్తుపల్లి

క్లుప్తంగా

50మందికి సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు


చెక్కులు అందుకున్న వారితో ఎంపీ రఘురాంరెడ్డి

ఖమ్మంమయూరిసెంటర్: ప్రైవేట్ ఆస్పత్రుల్లో చికిత్స పొందిన వారికి తన సిఫారసుతో మంజూరైన ముఖ్యమంత్రి సహాయ నిధి(సీఎంఆర్ఎఫ్) చెక్కులను ఖమ్మం ఎంపీ రామసహాయం రఘురాంరెడ్డి అందజేశారు. ఖమ్మంలోని క్యాంపు కార్యాలయంలో బుధవారం ఆయన రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావుతో కలిసి చెక్కులు పంపిణీ చేశాక మాట్లాడారు. ఖమ్మం, పాలేరు, మధిర, వైరా, సత్తుపల్లి నియోజకవర్గాలకు సంబంధించి 50 మందికి రూ.11.24లక్షల విలువైన చెక్కులు అందజేసినట్లు తెలిపారు. ప్రభుత్వం పేదల ఆరోగ్యానికి భరోసానిచ్చేలా సీఎంఆర్ఎఫ్ ద్వారా సాయం అందిస్తోందని చెప్పారు. కాంగ్రెస్ నాయకుడు కొప్పుల చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

మున్నేరు ప్రవాహంతో ట్రాఫిక్ మళ్లింపు

ఖమ్మంక్రైం: ఖమ్మంలోని కాల్వొడ్డు నుంచి నాయుడుపేట వరకు మున్నేరుపై ఉన్న చప్టాపై బుధవారం వరద పెరిగింది. దీంతో ఈ మార్గంలో వాహనాల రాకపోకలు నిలిపివేసి ప్రకాష్‌నగర్, కరుణగిరి వంతెన మీదుగా ప్రయాణం సాగించేలా ట్రాఫిక్ సీఐ బెల్లం సత్యనారాయణ ఆధ్వర్యాన పర్యవేక్షించారు.

రేపు ఫుట్‌బాల్ బాలికల జట్టు ఎంపిక పోటీలు

ఖమ్మం స్పోర్ట్స్: జూనియర్స్ విభాగంలో ఉమ్మడి జిల్లా స్థాయి బాలికల ఫుట్‌బాల్ జట్టు ఎంపికకు ఈనెల 4న ఖమ్మంలోని సర్దార్ పటేల్ స్టేడియంలో పోటీలు నిర్వహించనున్నట్లు అసోసియేషన్ జిల్లా కార్యదర్శి కె.ఆదర్శ్‌కుమార్ తెలిపారు. పోటీలకు వచ్చే హాజరయ్యే వారు ఆధార్ కార్డు, పుట్టినతేదీ ధ్రువీకరణ పత్రం, పాస్‌పోర్ట్ సైజ్ ఫొటోలు, కిట్‌తో శుక్రవారం 4గంటలకు రిపోర్టు చేయాలని సూచించారు.

వృత్తినైపుణ్యంతోనే విధుల్లో రాణింపు

వరంగల్ క్రైం: విధుల్లో రాణించాలంటే వృత్తి నైపుణ్యం పెంచుకోవడం తప్పనిసరని వరంగల్ పోలీసు కమిషనరేట్ ఈస్ట్‌జోన్ డీసీపీ అంకిత్‌కుమార్ అన్నారు. వరంగల్‌లో మూడు రోజుల పాటు జరగనున్న భద్రాది కొత్తగూడెం జోనల్ పోలీస్ డ్యూటీ మీట్ పోటీలను బుధవారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. మీట్‌లో వరంగల్, ఖమ్మం కమిషనరేట్లు, మహబూబాబాద్, భద్రాది జిల్లాల పోలీసులు పాల్గొంటున్నారని తెలిపారు. కేసుల విచారణ, శాస్త్రీయంగా సాక్ష్యాల సేకరణకు ఈ శిక్షణ ఉపయోగపడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో జోనల్ పరిధిలోని పోలీసు అధికారులు పలువురు పాల్గొన్నారు.

పామాయిల్ గెలలు



టన్ను ధర	రూ.17,463

మామిడి.. రైతుల్లో అలజడి

జిల్లాలోని వేంసూరు మండలం కొన్నేళ్ల క్రితం వరకు మామిడి తోటలకు చిరునామాగా నిలిచేది. ఇక్కడే ఎక్కువ తోటలు ఉండేవి. తద్వారా రైతులకే కాక సీజన్‌లో వేలాది మందికి ఉపాధి లభించేది. ఈ ప్రాంతం ఉంచి దక్షిణాది రాష్ట్రాలకు మామిడి ఎగుమతి చేసిన దాఖలాలు ఉన్నాయి. రానురాను తెగుళ్లు, మద్దతు ధర దక్కకపోవడంతో రైతులు మామిడిపై నిరాసక్తత కనబరుస్తున్నారు. ఫలితంగా కొత్త తోటలు వేయకపోగా.. పాత తోటలను సైతం పలువురు తొలగిస్తుండడం గమనార్హం. –వేంసూరు

- తెగుళ్లు, ధరలో నష్టంతో తోటలు తొలగిస్తున్న వైనం
- ఇదేక్రమాన పెరుగుతున్న ఆయిల్‌పామ్ సాగు
- సుదీర్ఘకాలం దిగుబడికి అవకాశం ఉండడంతో మొగ్గు


సాగులో ఉన్న ఆయిల్‌పామ్ తోట

జిల్లాలో 60 వేల ఎకరాల నుంచి..

దశాబ్ద కాలం క్రితం వరకు జిల్లా వ్యాప్తంగా దాదాపు 60వేల ఎకరాల్లో మామిడి సాగయ్యేది. ఇందులో ఒక్క వేంసూరు మండలంలోనే 25వేల ఎకరాల తోటలు ఉండేవి. అప్పట్లో కరువు మండలంగా పేరొందిన వేంసూరులో భూగర్భ జలాలు అంతంత మాత్రంగానే ఉండడంతో మామిడి ప్రధాన పంటగా కొనసాగేది. కానీ మారుతున్న వాతావరణ పరిస్థితులతో మామిడి సాగు చేస్తే రైతులకు ఏటా నష్టాలు తప్ప లాభాలు లేకపోవడంతో తోటలు తొలగిస్తున్నారు. వేంసూరు మండలంలో 25వేలుగా ఉన్న తోటలు ఇప్పుడు 7,012 ఎకరాలకు పడిపోవడం చర్చకు దారి తీస్తోంది. ఇక జిల్లాలోనూ గతంలో 60వేల ఎకరాలకు పైగా తోటలు ఉండగా.. ఇప్పుడు 31,988 ఎకరాలకు పడిపోయింది.

కల్లురుగూడెంలో ఫ్యాక్టరీ

జిల్లా వ్యాప్తంగా ఆయిల్ పామ్ సాగు విస్తీర్ణం ఏటా పెరుగుతోంది. ప్రస్తుతం ఇక్కడి రైతులు ఆయిల్ పామ్ గెలలను అశ్వారావుపేట, దమ్మపేట మండలాల్లోని ఫ్యాక్టరీలకు తరలిస్తున్నారు. అయితే, రైతులకు మరింత చేరువ చేయాలన్న లక్ష్యంతో వేంసూరు మండలం కల్లురుగూడెంలో ఫ్యాక్టరీ నిర్మాణానికి ఉగాది రోజున శంకుస్థాపన చేశారు. ఈ ఫ్యాక్టరీ అందుబాటులోకి వస్తే రైతులకు దూరాభారం తగ్గుతుంది. అలాగే, ఆయిల్‌పామ్ సాగు చేసే రైతులకు మూడేళ్లు ఏటా రూ.4,500 అందించడంతో పాటు ఇతర రాయితీలు కల్పిస్తుండడం చాలా మంది మొగ్గు చూపుతున్నారు. అంతేకాక చీడపీడల ఉధృతి ఉండకపోవడం, ప్రకృతి వైపరీత్యాలు, కోతుల బెడద లేకపోవడంతో సాగు పెరుగుతోంది. 2020–21 ఏడాదిలో జిల్లా అంతటా 6,192 ఎకరాల్లో ఆయిల్‌పామ్ సాగు కాగా.. ఇప్పుడు అది 34,491 ఎకరాలకు పెరగడం రైతుల ఆసక్తిని తెలియచేస్తోంది.


నరికిన మామిడి చెట్ల మొదళ్లు

చీడపీడలు, ప్రకృతి వైపరీత్యాలు

మామిడి తోటలను ఏటా ఏదో ఒక తెగులు వ్యాపిస్తోంది. పూత దశలో మంచు పురుగు, ఆతర్వాత మంగు తెగుళ్ల వంటివి ఆశిస్తుండడమే కాక వేసవిలో కాత వస్తున్నప్పుడు గాలిదుమారం కారణంగా దిగుబడి పడిపోతోంది. కష్టనష్టాలకు ఓర్చి సాగు చేసినా మార్కెట్‌లో సరైన ధర లభించడం లేదు. ఇలా రకరకాల కారణాలతో ఎగుమతులపై ఆధారపడిన రైతులు మామిడి సాగుకు దూరమతున్నారు.

ఏటా నష్టాలే..



వరుసగా నాలుగేళ్ల నుంచి మామిడి సాగుకు పెట్టుబడి తప్ప లాభాలు రావడం లేదు. వరుస నష్టాలతో ఏంచేయాలో పాలుపోవడం లేదు. చివరకు మామిడి తోటలను తొలగించి ఆయిల్‌పామ్ సాగు చేస్తున్నాం.

– అట్లూరి సత్యనారాయణరెడ్డి, అడసర్లపాడు

ఆయిల్‌పామ్‌తో లాభాలు



ఆయిల్‌పామ్ రైతులకు ప్రభుత్వం రాయితీలు ఇస్తోంది. చీడపీడలు, ప్రకృతి వైపరీత్యాలు లేకపోగా కోతుల బెడద ఉండదు. కల్లూరుగూడెం ఫ్యాక్టరీ ఏర్పాటు కానుండడంతో ఆయిల్‌పామ్ మొక్కలు నాటాను.

– రావి సత్యనానాయణ, అడసర్లపాడు

రైతు భరోసా ఎన్నికల జిమ్మిక్కే..

- జీసీ రిజర్వేషన్లు అమలయ్యేవరకు ఎన్నికలు వద్దు
- ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత


మాట్లాడుతున్న ఎమ్మెల్సీ కవిత, పక్కన నాయకులు

ఖమ్మంఅర్బన్/నేలకొండపల్లి: రైతులను మభ్యపెట్టి ఓట్లు సాధించేలా కాంగ్రెస్ ప్రభుత్వం రైతుభరోసా పథకాన్ని ఇచ్చిందని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత విమర్శించారు. ఇది నిజమైన సంక్షేమం కాదని, కేవలం ఎన్నికల స్టంట్ మాత్రమేనని ప్రజలంతా భావిస్తున్నారని తెలిపారు. ఖమ్మంలో ఇటీవల మృతి చెందిన మాజీ ఎమ్మెల్యే బానోత్ మదన్‌లాల్ కుటుంబంతో పాటు నేలకొండపల్లి మండలం అప్పలనరసింహాపురంలో తెలంగాణ జాగృతి నాయకురాలు అనిత తండ్రి నల్లబోతు నరసింహారావు మృతి చెందగా వారి కుటుంబాలను కవిత బుధవారం పరామర్శించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ మాట్లాడుతూ ఖమ్మంలో ముగ్గురు మంత్రులు ఉండి కూడా వడ్ల కొనుగోలులో ఇబ్బంది ఎదుర్కొన్న రైతులను పలకరించలేదని తెలిపారు. సన్న రకం పేరుతో బోనస్ అంటూ రైతులను మభ్యపెట్టారని చెప్పారు. కాగా, స్థానిక సంస్థల ఎన్నికల్లో 42 శాతం బీసీ రిజర్వేషన్లు అమలయ్యేలా చూడాలని, అప్పటివరకు ఎన్నికలు నిర్వహించొద్దని డిమాండ్ చేశారు. బిల్లు ఆమోదానికి ఈనెల 17న రైల్‌రోకో నిర్వహిస్తుండగా, మద్దతు ఇవ్వాలని బీసీ సంఘాలను కోరడమే కాక బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రామచంద్రరావుకు లేఖ రాశామని ఆమె వెల్లడించారు.

ప్రజలకు ఇచ్చిన హామీలేమయ్యాయి?

ఎన్నికలకు ముందు ప్రజలకు ఇచ్చిన హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం నెరవేర్చలేదని ఎమ్మెల్సీ ధ్వజమెత్తారు. ప్రజల ఆకాంక్షలు, అభివృద్ధిని విస్మరించడమే కాక ప్రశ్నిస్తే కేసులు పెడుతున్నారని మండిపడ్డారు. కాగా, గోదావరి జలాల తరలింపుపై జిల్లా మంత్రులు మాట్లాడకపోవడం ఏమిటని ప్రశ్నించిన కవిత, భద్రాద్రి రాముడి అభివృద్ధికి ఏపీలో విలీనమైన ఐదు గ్రామాలను తిరిగి తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈకార్యక్రమాల్లో బీఆర్‌ఎస్ ఖమ్మం నగర అధ్యక్షుడు పగడాల నాగరాజుతో పాటు కూరాకుల నాగభూషణం, గుండాల కృష్ణ, సేవాలాల్‌నాయక్, కిషన్‌నాయక్, వాంకుడోత్ సురేష్, తదితరులు పాల్గొన్నారు.

బ్లీచింగ్‌కూ నిధులు ఇవ్వని ప్రభుత్వం

బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్సీ మధు


మాట్లాడుతున్న ఎమ్మెల్సీ మధు, పక్కన నాయకులు

నేలకొండపల్లి: రాష్ట్రంలో కొందరు మీడియా ముసుగులో తెలంగాణ ఆత్మగౌరవాన్ని దెబ్బతీసేలా వ్యవహరిస్తున్నారని, ఈ విషప్రచారం వెనక సీఎం రేవంత్‌రెడ్డి కుట్ర ఉందని బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్సీతాతా మధుసూధన్ ఆరోపించారు. ఇలాంటి వారు తీరు మార్చుకోకపోతే దాడులు తప్పవని హెచ్చరించారు. నేలకొండపల్లిలోని బీఆర్‌ఎస్ కార్యాలయంలో బుధవారం ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్రజలకు నమ్మకం పోయిందన్నారు. గ్రామపంచాయతీల్లో బ్లీచింగ్ పౌడర్ చల్లేందుకు కూడా నిధులు రాకపోవడం, ట్రాక్టర్లలో డీజిల్ పోయించే పరిస్థితి లేక కార్యదర్శులు సెలవులో వెళ్తున్నారని తెలిపారు. కేసీఆర్ హయాంలో నిర్మించిన ప్రాజెక్టులు తప్ప కాంగ్రెస్ హయాంలో కాల్వలో తట్ట మట్టి కూడా తీయలేదని పేర్కొన్నారు. ఫలితంగా తెలంగాణ ప్రజలు మళ్లీ కేసీఆర్‌ను సీఎంగా చేసేందుకు సిద్ధంగా ఉన్నారని, రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లోనే ఈ ప్రభావం కనపడుతుందని ఎమ్మెల్సీ ధీమా వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు వున్నం బ్రహ్మయ్య, నాయకులు కోటి సైదారెడ్డి, నంబూరి సత్యనారాయణ, మరికంటి రేణుబాబు, తన్నీరు సత్యనారాయణ, కమదన ప్రవీణ్, మాదాసు ఆదాం, సాడేపొంగు ప్రశాంత్, అనగాని నర్సింహారావు, యలమంద, ఉదయ్, నాగేంద్రబాబు పాల్గొన్నారు.

హైవేపై వర్షపు నీరు, పరిశీలించిన అధికారులు


నీరు నిలిచే ప్రాంతాలను పరిశీలిస్తున్న అధికారులు

తల్లాడ: తల్లాడ రింగ్ సెంటర్‌లోని జాతీయ రహదారిపై వర్షం నీరు నిల్వ ఉండడంతో నేషనల్ హైవే అధికారులు బుధవారం పరిశీలించారు. వర్షం వచ్చినప్పుడల్లా ఇదే పరిస్థితి ఎదురవుతుండగా.. నేషనల్ హైవే సైట్ ఇంజనీర్ జి.కిరణ్ తదితరులు పరిశీలించి వివరాలు ఆరా తీశారు. అయితే, రహదారిపై చెత్తాచెదారం పేరుకుపోవడమే సమస్యకు కారణమని, చెత్త తొలగిస్తే నీరు నిల్వ ఉండదని ఎంపీడీఓ సురేష్‌బాబు తెలిపారు. ఈమేరకు అవసరమైన మరమ్మతులు చేయిస్తామని అధికారులు వెల్లడించారు.

జిల్లాలో విస్తారంగా వానలు

ఖమంవ్యవసాయం: బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం కారణంగా జిల్లాలో మూడు రోజులుగా విస్తారంగా వర్షాలు కురుస్తున్నాయి. జూన్‌లో లోటు వర్షపాతం నమోదు కాగా, గతనెల 30, ఈనెల 1, 2వ తేదీల్లో కురిసిన వర్షంతో సాధారణానికి మించి వర్షపాతం నమోదు కావడం విశేషం. ఈనెల 2వ తేదీ వరకు సాధారణ వర్షపాతం 9.8 మి.మీ.లు కాగా అల్పపీడనం కారణంగా కురుస్తున్న వర్షాలతో ఏకంగా 53.6 మి.మీ.లుగా నమోదైంది. కామేపల్లి, ఖమ్మం రూరల్, కొణిజర్ల, ఏన్కూరు, కల్లూరు, పెనుబల్లి, సత్తుపల్లి, వేంసూరు, తల్లాడ, వైరా, బోనకల్ మండలాల్లో సాధారణానికి మించి, సింగరేణి, రఘునాథపాలెం, నేలకొండపల్లి, ముదిగొండ, చింతకాని, ఖమ్మం అర్బన్, మధిర, ఎర్రుపాలెం మండలాల్లో సాధారణ వర్షపాతం నమోదైందని అధికారులు వెల్లడించారు. కూసుమంచి మండలంలో మాత్రం లోటు కొనసాగుతోంది. జిల్లాతో పాటు ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాలతో వాగులు, నదుల్లోకి నీరు చేరుతోంది.

బదిలీలు, పదోన్నతులు చేపట్టాలి

పీఆర్‌టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దామోదర్‌రెడ్డి


పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడిగా ప్రమాణ స్వీకారం చేస్తున్న శేఖర్‌రావు

ఖమ్మం సహకారనగర్: రాష్ట్రంలోని ప్రభుత్వ ఉపాధ్యాయుల్లో అర్హులకు పదోన్నతులు కల్పించడమే బదిలీలు చేపట్టాలని పీఆర్‌టీయై టీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పులగం దామోదర్‌రెడ్డి కోరారు. ఖమ్మంలోని సంఘం కార్యాలయంలో జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్.రంగారావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. జీపీఎఫ్ పెండింగ్ బిల్లులు క్లియర్ చేస్తామని డిప్యూటీ సీఎం హామీ ఇవ్వగా.. ఉపాధ్యాయులకు ఆరోగ్య కార్డుల జారీకి విధివిధానాలు సిద్ధమవుతున్నాయని తెలిపారు. కాగా, జిల్లా అధ్యక్షుడిగా ఉన్న వై.వెంకటేశ్వర్లు ఉద్యోగ విరమణ చేయగా, జిల్లా ఉపాధ్యక్షుడిగా ఉన్న కట్టా శేఖర్‌రావును ఆ స్థానంలో నియమించారు. ఈ సందర్భంగా ఆయనతో దామోదర్‌రెడ్డి ప్రమాణ స్వీకారం చేయించారు. ఖమ్మం రిక్కాబజార్ హైస్కూల్‌లో స్కూల్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న శేఖర్‌రావును పలువురు అభినందించారు. ఈకార్యక్రమంలో వివిధ సంఘాల నాయకులు మోత్కూరి మధు, కె.వెంకటనర్సయ్య, శ్రీనివాసరెడ్డి, జితేందర్‌రెడ్డి, నరేష్, యలమద్ది వెంకటేశ్వర్లు, మల్లెంపాటి శ్రీధర్, కె.శ్రీధర్‌రావు, శీలంశెట్టి వీరభద్రం తదితరులు పాల్గొన్నారు.

పిచ్చిమొక్కల తొలగింపు


రోడ్డు వెంట శుభ్రం చేసిన దృశ్యం

సాక్షి ఎఫెక్ట్..

వైరా: వైరా మున్సిపాలిటీ పరిధి 12వ వార్డులో సమస్యలపై మున్సిపల్ అధికారులు స్పందించారు. 'డ్రెయిన్లు పొంగి రహదారిపైకి' శీర్షికన ఈనెల 1వ తేదీన 'సాక్షి'లో ప్రచురితమైన కథనంతో కదలిక వచ్చింది. ఈమేరకు కమిషనర్ చింత వేణు ఆధ్వర్యాన సిబ్బంది పరిశీలించి రోడ్ల వెంట పెరిగిన పిచ్చిమొక్కలు, డ్రెయిన్లలో పేరుకుపోయిన చెత్తాచెదారం తొలగించారు.

నేత్రపర్వంగా జగన్నాథ రథయాత్ర


జిల్లా కేంద్రంలో కొనసాగుతున్న రథయాత్ర

ఖమ్మంగాంధీచౌక్: ఖమ్మంలో బుధవారం జగన్నాథ రథయాత్ర నేత్రపర్వంగా సాగింది. ఇస్కాన్ ఆధ్వర్యాన వర్తక సంఘం కార్యాలయం వద్ద ప్రారంభమైన రథయాత్ర గాంధీచౌక్, కాల్వొడ్డు, జూబ్లీక్లబ్, మయూరిసెంటర్, పాత బస్టాండ్, వైరారోడ్, జెడ్పీ సెంటర్, ఇల్లెందు క్రాస్ మీదుగా రోటరీనగర్ రాజరాజేశ్వరీదేవి ఆలయం వరకు సాగింది. ఆకర్షణీయంగా రథాన్ని అలంకరించి విష్ణువు రూపాలుగా భావించే జగన్నాథుడు, బలభద్రుడు, సుభద్ర విగ్రహాలనుప్రతిష్ఠించారు. ఆతర్వాత భక్తులు రథాన్ని తాళ్లతో లాగుతుండగా.. దారి పొడవునా భక్తులు రంగురంగుల ముగ్గులు వేయడమే కాక కోలాట నృత్యాలు ప్రదర్శించారు. ఇస్కాన్ ప్రతినిధులు దేవదాసు, రామ్, అప్పారావు, ఈశ్వర్, కన్నోజు గురుబ్రహ్మం, హన్మంతరావు తదితరులు పాల్గొన్నారు.

బాలిక గర్భానికి కారణమైన బాలుడిపై పోక్సో కేసు

కామేపల్లి: పద్నాలుగేళ్ల బాలికను ప్రేమిస్తున్నానని మాయమాటలు చెబుతూ లోబర్చుకున్న పదిహేడేళ్ల బాలుడిపై పోక్సో కేసు నమోదు చేసినట్లు కామేపల్లి పోలీసులు తెలిపారు. మండలంలోని ఓ గ్రామానికి చెందిన బాలిక 9వ తరగతి చదువుతుండగా, మరో గ్రామానికి చెందిన బాలుడు ప్రేమ, పెళ్లి పేరిట మాయమాటలు చెప్పి లోబర్చుకున్నాడు. ఆమెకు ఇటీవల కడుపునొప్పి రాగా కుటుంబీకులు ఆస్పత్రికి తీసుకెళ్లడంతో పరీక్షించగా గర్భం దాల్చినట్లు తేలింది. కుటుంబీకుల ఫిర్యాదుతో బాలుడిపైనే కాక ఆయన స్నేహితుడిపై పోక్సో కేసు నమోదు చేసి బాలికను భరోసా కేంద్రానికి తరలించినట్లు పోలీసులు తెలిపారు.

యువకుడిపై...

బోనకల్: మండలంలోని ఓ గ్రామంలో బాలికపై లైంగిక దాడికి పాల్పడిన యువకుడిపై యువకుడిపై పోక్సో కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ పి.వెంకన్న తెలిపారు. మూడో తరగతి చదివే బాలికపై లక్ష్మీకాంత్ లైంగిక దాడికి పాల్పడ్డాడు. దీంతో బాధితురాలు ఏడుస్తూ వెళ్లి తల్లికి చెప్పగా ఆమె ఫిర్యాదుతో బుధవారం కేసు నమోదు చేశారు. కాగా, ఏసీపీ రెహమాన్ గ్రామానికి వెళ్లి విచారణ చేపట్టారు.

ప్రేమ పేరుతో వేధిస్తున్న వ్యక్తిపై..

బోనకల్: ప్రేమ పేరుతో యువతిని వేధిస్తున్న వ్యక్తిపై బుధవారం కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ పి. వెంకన్న తెలిపారు. వైరాకు చెందిన ఆదూరి బాలు నాలుగేళ్లుగా కలకోటకు చెందిన యువతిని ప్రేమిస్తున్నాననంటూ వెంట పడడమే కాక ఆమెకు వస్తున్న పెళ్లి చెడగొడుతున్నాడు. దీంతో యువతి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

సైబర్ మోసాలపై..

రఘునాథపాలెం: మండలంలోని పరికలబోడు తండాకు చెందిన విద్యార్థి తేజావత్ సంతోష్, తాటాకుల తండాకు చెందిన గృహిణి బానోతు జయమ్మ రుణం ధని యాప్‌లో ప్రయత్నించగా విడతల వారీగా రూ.48,590, రూ.50వేల చొప్పున జమ చేయించుకున్న సైబర్ మోసగాళ్లు ముఖం చాటేశారు. బాధితుల ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు సీఐ ఉస్మాన్ షరీఫ్ తెలిపారు.